సాక్షి చిత్తూరు

మంగళవారం ◊ 31 ◊ డిసెంబర్ ◊ 2024



ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం

క్రైస్తవులకు ఏ కష్టమొచ్చినా తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. - 8లో



దయచూపండయ్యా!

వినతులు ఇస్తున్నాం.. సమస్యల పరిష్కారంపై దయ చూపండయయ్యా..అంటూ జిల్లా ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. - 8లో



దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి 13 టన్నుల కూరగాయల వితరణ



టీటీడీ వాహనానికి పూజలు చేస్తున్న శ్రీవారి సేవకులు

పలమనేరు: తిరుమల, కాణిపాకంలో జరుగుతున్న నిత్యాన్నదానం పథకాలకు పలమనేరుకు చెందిన దాతలు 13 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. పలమనేరు పట్టణానికి చెందిన దాతల సాయంతో స్థానిక శ్రీవారి సేవకులు తిరుమలలోని నిత్యాన్నదాన పథకానికి పది టన్నులు, కాణిపాకంలోని నిత్యాన్నదాన పథకానికి 3 టన్నుల వివిధ రకాల కూరగాయలను టటీడీ వాహనంలో సోమవారం ఇక్కడి మార్కెట్ నుంచి తరలించారు. ఈ సందర్భంగా గోవిందనామ స్మరణల నడుమ టీటీడీ ప్రత్యేక వాహనానికి పూజలు చేశారు. నిర్వాహకులు రవి, కిశోర్, దాతలు మురళీ కాఫీవర్క్స్ శ్రీకాంత్, మంజునాథ్, శ్యామ్, వెంకటేష్, జైసింగ్, మహేంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మండీ యజమానులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

పశుగ్రాస పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బహు వార్షిక పశుగ్రాస పెంపకానికి దరఖాస్తులు చేసుకోవచ్చునన్ని పశుసంవర్ధక జేడీ ప్రభాకర్ తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఈ పెంపకం జరుగుతుందన్నారు. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు ఫారంతో పాటు జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నకలతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



మణికంఠ

చిత్తూరు అర్బన్: న్యూ ఇయర్ సంబరాల పేరిట నిబంధనలను అతిక్రమి స్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చిత్తూరు ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. లాడ్జీలు, ఇతర స్థలాల్లో కార్యక్రమాలు నిర్వహించే వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఈవెంట్స్ నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఇక చిత్తూరు నగరంలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పోలీసుల తనిఖీలు కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపితే.. వాహనాలను సీజ్ చేసి, నిందితులను కోర్టుకు తరలిస్తామన్నారు. ఫ్లైఓవర్లు, రోడ్లపై న్యూ ఇయర్ వేడుకలు నిషేధమని, మద్యం బార్లు, దుకాణాలు నిర్ణీత సమయంలో మూసేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బ్లూకోల్ట్, రక్షక్, హైవే పట్రోల్ సిబ్బంది గస్తీ, నిఘా ఉంటుందని, ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించి, నిబంధనలు పాటిస్తే మంచిదన్నారు. ప్రజలకు ఎక్కడైనా ఇబ్బందులు వస్తే డయల్-112, పోలీసు వాట్సాప్ 944900005 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అజెండాలోని అంశాలైన వ్యవసాయం, ఉద్యానవనం, విద్యా, వైద్య, గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, అంగన్‌వాడీశాఖల పరంగా చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని కోరారు.

సంక్షోభం



బాబు మాటలకెన్నో అర్థాలున్నాయి..నోటి నిండా అబద్ధాలే ఉంటాయి..
ఎండమావులెలా దప్పిక తీర్చవో.. బాబు హామీలూ అలా మారిపోయాయి.
సూపర్ సిక్స్ పేరుతో 'మాయ'ఫెస్టో తీసుకొచ్చి.. హామీల వర్షం కురిపించేసి..
ఓట్లు దండుకుని గద్దెనెక్కిన చంద్రబాబు అన్ని విషయాల్లోనూ
జనానికి టోపీ పెడుతున్నారు. ప్రజల ఆశలపై నీళ్లు
చల్లుతున్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తయినా
అన్నీ మోసాలే తప్ప.. ఏ వర్గాన్ని సంతృప్తి పరచలేదు.
అన్నదాతలు, ఆడపడుచులు,
చిరుద్యోగులు, నిరుద్యోగులు,
యువతీయువకులు, కార్మికులు ఒక్కరేమీ
ఇలా సమాజంలో ప్రతి ఒక్కరి జీవితాన్ని
రోడ్డున పడేశారు.

2024 రివైండ్

బాబు మాట.. సద్దన్నం మూట

- ఇచ్చిన హామీలను నెరవేర్చని టీడీపీ కూటమి ప్రభుత్వం
- గత ఏడు నెలలుగా చంద్రబాబు కాలయాపన
- సంక్షేమ పథకాల్లేక.. ప్రజలు ఉక్కిరి బిక్కిరి
- సూపర్ సిక్స్ పేరుతో మోసం
- జిల్లాలో పథకాలందక లక్షలాది మంది ప్రజలకు నష్టం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిని గుర్తు చేసుకుంటున్న జిల్లా వాసులు

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి అయినా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా గాలికి వదిలేసింది. కక్ష్య సాధింపులకు పెద్దపీట వేసిన కూటమి ప్రజా సంక్షేమ పథకాల అమలును పక్కన పెట్టింది. ఈ క్రమంలో గత ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాల చిత్తశుద్ధిని జిల్లా వాసులు గుర్తు చేసుకుంటున్నారు. జగనన్న పాలనకు ప్రస్తుత చంద్రబాబు నాయుడు పాలన పనితీరును బేరీజు వేసుకుంటున్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో చెప్పిన మాటలన్నీ ఒట్టి మాటలేనని సంక్షేమా...అదెక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పథకాలు అందక చితికిన జీవనం

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లాలోని 32 మండలాల్లో 822 రెవెన్యూ గ్రామాలు, 697 గ్రామ పంచాయతీలు, ఒక నగరపాలక సంస్థ, నాలుగు మున్సిపాలిటీలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 18.73 లక్షల జనాభా ఉండగా, పురుషులు 9.40 లక్షలు, మహిళలు 9.33 లక్షల మంది నివసిస్తున్నారు. అర్బన్‌లో 3.29 లక్షలు, రూరల్‌లో 15.04 లక్షల మంది జనాభా ఉన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి అయినప్పటికీ సంక్షేమ పథకాలు అందక ప్రజల జీవితాలు చితికిపోయాయి.

వైఎస్సార్ సీపీ పాలనలో ఏటా సంక్షేమ క్యాలెండర్

వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక సంక్షేమ క్యాలెండర్‌ను అమలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం జగనన్న ప్రతి పథకాన్ని సంక్షేమ క్యాలెండర్‌లో పొందుపరిచి, ఎప్పుడు అమలు చేస్తామనే విషయాన్ని పేర్కొన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి మార్చి వరకు సంక్షేమ క్యాలెండర్‌ను అమలు చేసేవారు. ఈ పథకాల పొందే లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి చెంది, తమ కుటుంబాలను సంతోషంగా పోషించుకునే వారు. ప్రస్తుతం ఆరు నెలలుగా పథకాలు అమలు కాకపోవడంతో అప్పులు చేసి, జీవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొహం చాటేస్తున్న ఎమ్మెల్యేలు

సంక్షేమ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు నిలదీస్తారనే భయంతో ఎమ్మెల్యేలు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లకుండా మొహం చాటేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో గ్రామాల్లోకి వెళితే ప్రజలు అభివృద్ధి పనులు ఎప్పుడు చేస్తారంటూ? నిలదీస్తున్నారని ఇటీవల డీఆర్సీ సమావేశంలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ బహిరంగంగా వెల్లడించారు. ఇలాంటి పరిస్థితులే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నెలకొనడంతో కూటమి ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు వెళ్లకుండా మొహం చాటేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు లేకపోవడంతో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లలేకపోతున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే...ఐదేళ్లు ఇంకెలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు.

ప్రజలు నష్టపోయిన పథకాలివీ..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటే జూన్ నుంచి డిసెంబర్ వరకు 21 సంక్షేమ పథకాలను అమలు చేసేవారని, ప్రస్తుతం అవన్నీ నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడినట్లు ప్రజలు వాపోతున్నారు.

- జూన్‌లో జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), మిగిలిపోయిన లబ్ధిదారుల లబ్ధి.
- జూలైలో జగనన్న విదేశీ విద్యా దీవెన (మొదటి విడత), వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు (మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కళ్యాణమస్తు-షాదీతోఫా (రెండో త్రైమాసికం).
- ఆగస్టు.. జగనన్న విద్యాదీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర.
- సెప్టెంబర్.. వైఎస్సార్ చేయూత
- అక్టోబర్.. వైఎస్సార్ రైతు భరోసా (రెండో విడత), జగనన్న వసతి దీవెన (మొదటి విడత).
- నవంబర్.. పంట రుణాలకు వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ కళ్యాణమస్తు షాదీతోఫా (మూడో త్రైమాసికం), జగనన్న విద్యాదీవెన (మూడో విడత).
- డిసెంబర్.. జగనన్న విదేశీ విద్యాదీవెన (రెండో విడత), జగనన్న చేదోడు, మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి.

ఎప్పుడిస్తారో ఆ భగవంతుడికే తెలియాలి



ఎన్నిల ముందు అరచేతిలో వైకుంఠం చూపారు. అవి ఇస్తాం.. ఇవి ఇస్తాం.. అంటూ ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా, చేదోడు, ఆసరా, డ్వాక్రా వడ్డీ మాఫీ తదితర పథకాలు మాకు అందాయి. మా అబ్బాయికి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన ఏటా క్రమం తప్పకుండా పడింది. ఈ ఏడాది ఒక్క పథకమూ లేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ తప్ప ఎటువంటి లబ్ధి చేకూరలేదు.

-ఎస్.కవిత, గృహిణి, ముడిపల్లె, నగరి మండలం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాలివీ..	
విద్యాదీవెన	రూ. 20 వేలు
వసతి దీవెన (రెండు దఫాలు)	రూ.12,400
రైతు భరోసా	రూ.13,500
చేదోడు	రూ.10 వేలు
డ్వాక్రా వడ్డీ మాఫీ	రూ. 2వేలు
ఆసరా	రూ.20,900
మొత్తం	రూ.78,800

కూటమి పాలనలో ఇదీ పరిస్థితి	
ఫీజు రీయింబర్స్‌మెంట్	లేదు
నిరుద్యోగ భృతి	లేదు
ఉచిత గ్యాస్	రూ.819
తల్లికి వందనం	లేదు
కొత్త రేషన్ కార్డు	లేదు
ఉచిత బస్సు ప్రయాణం	లేదు
మహిళకు భృతి	లేదు
మొత్తం	రూ.819

ఇచ్చిన మాట నిలుపుకోవాలి కదా?



టీడీపీ కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి కదా. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారు. ఇప్పుడేమో అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతుంటే ఎలాంటి హామీలు నెరవేర్చడం లేదు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు నెరవేస్తారో కూడా తెలియజేయడం లేదు. ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు కేవలం గ్యాస్ డబ్బులు రూ.819, పింఛన్ మాత్రం అందాయంతే.

– కస్తూరి, గృహిణి, భరత్‌నగర్, వి.కోట.

వైఎస్సార్‌సీపీ పాలనలో లబ్ధి
అమ్మఒడి : రూ.71 వేలు
ఇంటి స్థలం : రూ.2.50లక్షలు
ఇంటి నిర్మాణం : రూ.1.10 లక్షలు
అత్త శాంతమ్మ పింఛన్ :
రూ.1.80లక్షలు
మొత్తం : రూ.6.11 లక్షలు

టీడీపీ పాలనలో పొందిన లబ్ధి
అమ్మఒడి : లేదు
అత్త శాంతమ్మ పింఛన్ రూ.21 వేలు
దీపం పథకం రూ.819
మొత్తం : రూ.21,819

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొందిన లబ్ధి	
అమ్మఒడి నాలుగు సార్లు	రూ.55 వేలు
సున్నా వడ్డీ	రూ.28 వేలు
వైఎస్సార్ ఆసరా	రూ. 1.20 లక్షలు
వడ్డీమాఫీ	రూ. 21 వేలు
మొత్తం	2.24 లక్షలు

టీడీపీ కూటమి పాలనలో ఇదీ పరిస్థితి	
ఫీజు రీయింబర్స్‌మెంట్	లేదు
నిరుద్యోగ భృతి	లేదు
ఉచిత గ్యాస్	లేదు
తల్లికి వందనం	లేదు
కొత్త రేషన్ కార్డు	లేదు
ఉచిత బస్సు ప్రయాణం	లేదు
మహిళకు భృతి	లేదు
మొత్తం	ఎలాంటి లబ్ధి కలగలేదు.

ఇంతవరకు ఏ పథకం అందలేదు



అధికారం కోసం ఓటర్లను నమ్మించేందుకు కూటమి నేతలు ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చాక నీకు 15 నీకు 18. నీకు 20, నీకు 5 వేలు ఇస్తామంటూ నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. అయితే ఇప్పటివరకు ఒక్క పథకం అందలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చదువుకునే పిల్లలకు అమ్మఒడి, సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, చేదోడు, డ్వాక్రా రుణమాఫీ తదితర పథకాలు మాకు అందాయి. కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు కనీసం ఒక్క పథకం కూడా రాలేదు.

– మీనా, నల్లవెంగనపల్లి, వెదురుకుప్పం మండలం

వైఎస్సార్‌సీపీ పాలనలో పొందిన లబ్ధి	
అమ్మఒడి పథకం	రూ.55 వేలు
ఆసరా	రూ.18,260
డ్వాక్రా వడ్డీ	రూ.2,060
మొత్తం	రూ.75,320

టీడీపీ కూటమి పాలనలో ఇదీ పరిస్థితి			
ఫీజు రీయింబర్స్‌మెంట్	లేదు	కొత్త రేషన్ కార్డు	లేదు
నిరుద్యోగ భృతి	లేదు	ఉచిత బస్సు ప్రయాణం	లేదు
ఉచిత గ్యాస్	లేదు	మహిళకు భృతి	లేదు
తల్లికి వందనం	లేదు	మొత్తం	ఎలాంటి లబ్ధి కలగలేదు

సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటికో?



సీఎం చంద్రబాబు మాటలు నమ్మేందుకు వీలు లేదు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదు. పసుపు కుంకుమ పేరుతో మహిళలకు మొండి చేయి చూపించారు. ఇప్పటి పరిస్థితి అంతే. గత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమ్మ ఒడి, ఆసరా, డ్వాక్రా రుణమాఫీ పథకాలు అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటికీ ఒక్క పథకం అమలు చేయలేదు.

– అంబిక, శివాలయం వీధి, కార్వేటినగరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేకూరిన లబ్ధి
అమ్మఒడి: రూ. 70 వేలు
డ్వాక్రా వడ్డీ మాఫీ: రూ. 10 వేలు
డ్వాక్రా రుణాలు: రూ. 2 లక్షలు
ఇంటి స్థలం విలువ(సుమారు): రూ. 2.50 లక్షలు
ఇంటి నిర్మాణం కొరకు: రూ. 1.85 లక్షలు
మొత్తం: రూ. 7.15 లక్షలు

అదే కూటమి పాలనలో ఇదీ పరిస్థితి	
తల్లికి వందనం:	లేదు
ఉచిత గ్యాస్:	లేదు
ఉచిత బస్సు ప్రయాణం:	లేదు
మహిళకు భృతి:	లేదు

ఇలా ఏ పథకమూ అందలేదు

కూటమి హామీలు అట్టకెక్కినట్టేనా?



ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అనేక హామీలు ప్రకటించిన కూటమి నేతలు ప్రజల చేత ఓట్లు వేయించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ప్రకటించిన హామీలను మరిచారు. అధికారం కోసమేనా ఓట్లు వేయించుకున్నది. హామీలను తుంగలో తొక్కినట్టేనా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7నెలలు కావస్తుంది. ఏ ఒక్కటైనా నెరవేర్చారా. హామీల మాట కూటమి నేతల నోట ఏ మాత్రం వినిపించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు పథకాలు రాష్ట్రంలోని నాలాంటి మహిళలు ఎందరికో అందాయి. ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క పథకం కూ డా మా కుటుంబానికి రాలేదు. ఎలాంటి లబ్ధి చేకూరలేదు.

-అనిత, గృహిణి, కొత్తపలి, గంగవరం మండలం

వైఎస్సార్‌సీపీ పాలనలో లబ్ధి
రైతుభరోసా : రూ.60 వేలు
పంట బీమా : రూ.12 వేలు
మొత్తం : రూ.72 వేలు

కూటమి టీడీపీ పాలనలో లబ్ధి	
పంట రుణం :	లేదు
తల్లికివందనం :	లేదు
అన్నదాత సుఖీభవ :	లేదు
కొత్త పింఛన్ :	లేదు
మొత్తం: ఎలాంటి సహాయం లేదు.	

రైతులకు ఎలాంటి సాయం లేదు



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు ఎలాంటి సాయం అందలేదు. రైతులు దేశానికి వెన్నెముకలాంటి వారు అలాంటి రైతులను విస్మరించడం అన్యాయం. గత ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేశారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ముంగిటకే సేవలు అందజేశారు. సమయానికి రైతుభరోసా, పంటల బీమా పథకాలను అమలు చేసి మేలు చేశారు. ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయ్యింది. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పథకాలేమీ అమలు చేయడం లేదు.

– సుధాకర్, రైతు, ఐరాల

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించిన పీఎస్‌ఎల్‌వీ రాకెట్ బహుళ ప్రయోజనకారిగా విజయవిహారం చేస్తోంది. ప్రపంచపటం మీద ఇస్రో తిరుగులేని విజయాలను సాధిస్తూ వజ్రాయుధంగా మారింది. పోలార్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (పీఎస్‌ఎల్‌వీ) వాణిజ్యపరమైన ప్రయోగాల్లో అగ్రస్థానంలో వెలుగొందుతూ బహుళ ప్రయోజనకారిగా మారింది.



నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్‌ఎల్‌వీ సీ 60

టార్గెట్‌ను మించి.. ఛేజర్‌ను దించి!

పీఎస్‌ఎల్‌వీ సీ60 రాకెట్ ప్రయోగం ఇలా..

పీఎస్‌ఎల్‌వీ సీ-60 రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగించారు. మొదటి, మూడో దశలు ఘన ఇంధనంతో, రెండు, నాలుగు దశలు ద్రవ ఇంధనంతో నిర్వహించారు. ఈ ప్రయోగంలో 440 కిలోల బరువు కలిగిన స్పాడెక్స్ పేరుతో రెండు జంట ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

- పీఎస్‌ఎల్‌వీ సీ60 రాకెట్ 44.5 మీటర్లు ఎత్తు కలిగి ప్రయోగ సమయంలో 229 టన్నులతో ప్రయాణం ప్రారంభించింది. దీనికి స్ట్రాఫాన్ బూస్టర్లు లేవు కాబట్టి 229 టన్నుల బరువుతో నింగివైపు దూసుకెళ్లింది.
- కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనాన్ని నింపి 111.12 సెకండ్లకు మొదటి దశను పూర్తిచేశారు.
- రెండో దశలో 188.32 సెకండ్లకు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాలకు అమర్చిన రక్షణ కవచం హీట్‌షీల్డ్ విడిపోయింది. ఈ దశలో 41 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 262.06 సెకండ్లకు పూర్తిచేశారు.
- మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనంతో 511.22 సెకండ్లకు పూర్తిచేశారు.
- 1.6 టన్నుల ద్రవ ఇంధనంతో 792.48 సెకండ్లకు నాలుగో దశను కటాఫ్ చేశారు.
- తర్వాత ట్రిమ్మింగ్ మాడ్యూల్‌తో 909.48 సెకండ్లకు అంటే 15.15 నిమిషాలకు 220 కిలోలు బరువు కలిగిన స్పాడెక్స్-బీ అంటే టార్గెట్ ఉపగ్రహాన్ని, 912.48 సెకండ్లకు అంటే 15.20 నిమిషాలకు మరో 220 కిలోల బరువు కలిగిన స్పాడెక్స్-ఏ అంటే ఛేజర్ ఉపగ్రహాలు రెండింటినీ భూమికి 470 కిలోమీటర్లు ఎత్తులో సెమీ మేజర్ యాక్సిస్ అనే కొత్తరకం కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.

సూళ్లూరుపేట: శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి సోమవారం రాత్రి 10.00.15 గంటలకు ప్రయోగించిన పీఎస్‌ఎల్‌వీ సీ60 ప్రయోగంతో విజయవంతమైంది. ఇప్పటిదాకా 62 ప్రయోగాలు చేయగా రెండు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. 1993 సెప్టెంబర్ 20న పీఎస్‌ఎల్‌వీ డీ1 పేరుతో మొదటి ప్రయోగాన్ని నిర్వహించారు. దురదృష్టవశాత్తూ ఆ ప్రయోగం విఫలమైంది. మళ్లీ 2018లో ఒక ప్రయోగం విఫలమైంది. గడిచిన 30 సంవత్సరాల్లో పీఎస్‌ఎల్‌వీ సీ60 ప్రయోగంతో 60 ప్రయోగాలను విజయవంతం చేశారు. ఇప్పటిదాకా 62 పీఎస్‌ఎల్‌వీ రాకెట్ల ద్వారా 505 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇందులో 433 విదేశీ ఉపగ్రహాలే కావడం విశేషం. 72 స్వదేశీ ఉపగ్రహాలతో పాటు దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన 13 చిన్నపాటి ఉపగ్రహాలను ప్రయోగించారు. రెండు నుంచి నాలుగు టన్నులకు మించి బరువు కలిగిన అతి పెద్ద ఉపగ్రహాలను ఇస్రో ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష సంస్థల నుంచి పంపిస్తుంటే.. అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్‌ఎల్‌వీ ద్వారా ప్రయోగిస్తోంది. వాణిజ్యపరంగా ఇస్రోకు ఆదాయాన్ని తీసుకొచ్చే అతిపెద్ద ఆదాయ గనిగా మారింది. చంద్రయాన్, మంగళ్‌యాన్, సూర్యయాన్ లాంటి గ్రహాంతర ప్రయోగాలు, ఒకే సారి పది ఉపగ్రహాలు, మళ్లీ 20 ఉపగ్రహాలు, ఆ తరువాత 104, మళ్లీ 38 ఉపగ్రహాలను మోసుకెళ్లి అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలిగిన సత్తా పీఎస్‌ఎల్‌వీకే మాత్రమే దక్కింది.

క్లుప్తంగా

చిత్తూరు రోడ్లపై తహసీల్దార్ల రచ్చ

చిత్తూరు అర్బన్: పలమనేరు నియోజకవర్గానికి చెందిన రెవెన్యూ అధికారులిద్దరు సోమవారం రాత్రి చిత్తూరులో రోడ్లపై రచ్చరచ్చ చేశారు. బాధితుడి కథనం మేరకు.. గంగవరం తహసీల్దార్ శివ, పెద్దపంజాణి తహసీల్దార్ ప్రసన్న ఇద్దరు చిత్తూరులోని ఓ మద్యం బారుకు వెళ్లారు. అదే బారులో చిత్తూరుకు చెందిన కృష్ణ కుమార్ కూడా ఉన్నాడు. కృష్ణ కుమార్ పలమనేరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో ఇద్దరు తహసీల్దార్లతో పరిచయం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముగ్గురు మధ్య వివాదం రావడంతో రోడ్లపై కొచ్చి.. కృష్ణకుమార్‌పై ఇద్దరు తహసీల్దార్లు దాడి చేశారు. అనవసరంగా తనపై దాడి చేసిన తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోనే తహసీల్దార్లు ఇలా వీధి రౌడీల ప్రవర్తించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా రవికుమార్


డీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

చిత్తూరు అర్బన్: జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా ఎం.రవికుమార్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురంలో పనిచేస్తున్న ఈయన్ని చిత్తూరుకు బదిలీ చేశారు. కాగా చిత్తూరులో డిప్యూటీ కమిషనర్ విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, బాధ్యతలు తీసుకున్నారు. సారా, కర్ణాటక మద్యం, గంజాయి కట్టడికి చర్యలు తీసుకుంటామని రవికుమార్ అన్నారు.

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చిత్తూరులో ప్రారంభమయ్యాయి. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ప్రారంభమైన ఈ పరీక్షలను ఎస్పీ మణికంఠ పర్యవేక్షించారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకున్న తరువాత.. 1600 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంతో పాటు లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. తొలిరోజు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 293 మంది హాజరయ్యారు. 224 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకాలేదు. రాత పరీక్షల కోసం 155 మంది అర్హత సాధించారు.


పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

నినదిస్తూ.. నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ!

'కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ విద్యార్థుల గోడు పట్టించుకోకుండా పోయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయకుండా మొండి చేయి చూపుతోంది' అంటూ విద్యార్థి, యువజన సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఏఐఎస్‌ఎఫ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం పిలుపు మేరకు ఎస్‌ఎస్‌ఎఫ్‌యూఐ, ఏఐవైఎఫ్, వైఎస్సార్ యువజన విభాగం, జీఎస్‌ఎస్, ఓటీసీ, పీడీఎస్‌వో విద్యార్థి, యువజన సంఘాల నేతలు వందలాది మంది విద్యార్థులతో కలిసి సోమవారం రోడ్డెక్కారు. విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. అనంతరం అన్నమయ్య సర్కిల్‌లో మానవహారం చేపట్టారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా విమర్శలు గుప్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

– తిరుపతి కల్చరల్

విద్యార్థుల గోడు పట్టదా బాబూ?
- ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయండి
- యువగళం హామీలు నెరవేర్చండి
- కదం తొక్కిన విద్యార్థి సంఘాల నేతలు


అన్నమయ్య సర్కిల్లో నిరసన ర్యాలీ చేపడుతున్న విద్యార్థి, యువజన సంఘ నేతలు

కక్ష కాదు..కష్టాలు వినండి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించింది. కక్ష సాధింపు చర్యలే లక్ష్యంగా పాలన సాగిస్తోంది. విద్యార్థుల చదువులకు గండి కొట్టింది. విద్యార్థులకు అందించాల్సిన పెండింగ్ ఫీజు బకాయిలు, వసతి దీవెన అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కోర్సులు పూర్తి చేసుకున్నా సర్టిఫికెట్లు లేక విద్యార్థులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. లేకుండా జగనన్న పిలుపు మేరకు జనవరి 29న పోరుబాటలో విద్యార్థి లోకం కదం తొక్కి కనువిప్పు కలిగించక తప్పదు. – ఓబులురెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

స్పందించాలి



కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకంలో ఉన్న శ్రద్ధ విద్యార్థుల కష్టాలపై చూపకపోవడం శోచనీయం. ఫీజు బకాయిలు అందక విద్యార్థుల భవిత ఆందోళనకరంగా మారుతోంది. తక్షణం బకాయిలు విడుదల చేయాలి.

– ఆశా, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి

రోడ్డున పడేశారు



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యారంగాన్ని భ్రష్టు పట్టించింది. విద్యార్థులను రోడ్డుపైకి నెట్టేసింది. నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. లేకుంటే రాజీనామా చేసి రెడ్‌బుక్ మూసుకొని ఇంట్లో కూర్చోవాలి.

– బండి చలపతి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నేత

ఆందోళన ఉధృతం



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఒడ్డు దాటాక తెప్ప తగలేసిన చందాగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,580 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాల్సి ఉంది. తక్షణం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

– మోహన్‌రెడ్డి, వైఎస్సార్ యువజన విభాగం నేత

జీవో నం.77ను రద్దు చేయాలి



విద్యార్థులకు శాపంగా మారిన జీవో నం.77ను రద్దు చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ జీవోపై ఇంత వరకు మాట్లాడకపోవడం బాధాకరం.

– సుందరరాజ్, ఎస్‌ఎల్‌ఎస్‌ఏ నేత

రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే మాలలకు కష్టాలే

– మాజీ ఎంపీ రెడ్డెప్ప


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, చిత్రంలో సుదర్శనం, రాజేష్, గౌతమి

పుంగనూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో ఉన్నతాశయంతో రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే మాలలకు రక్షణ కరువు అవుతుందని మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని బీఎంఎస్‌క్లబ్‌లో మాలల మహాగర్జన సభను వేలాది మందితో నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథులు గా విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి గౌతమి, మాలల జాతీయ నేతలు యమలా సుదర్శనం, రాజేష్, వెంకట్రావు పాల్గొన్నారు. పీవీ రావు, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించి, జ్యోతి వెలిగించి మహా గర్జనను ప్రారంభించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ మాలల ఐకమత్యాన్ని చాటాలని, మాలల కేకలతో ప్రభుత్వాలకు వణుకు పుట్టేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే యమలా సుదర్శనం మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాసి ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు ఎవరికి ఉందని నిలదీశారు. రాజేష్ మాట్లాడుతూ తాను మాలల వైపు పోరాటం సాగిస్తామన్నారు. విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి గౌతమి మాట్లాడుతూ మాలలకు వర్గీకరణ అవసరం లేదన్నారు. నేతలు రమేష్, కొండలరావు, అశోక్, భాస్కర్, జయకుమార్, వెంకటేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, చిన్నబ్బ, అంజిబాబు, రాజేంద్ర, సుమిత్ర, శ్రీనివాస్, బి.రెడ్డెప్ప, మహానంది, కమలమ్మ, ఈశ్వరమ్మ, రవికుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

ఏ కష్టం వచ్చినా క్రైస్తవులకు అండగా ఉంటాం


పుంగనూరులో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను పరిశీలించడానికి వెళుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: క్రైస్తవులకు ఎప్పుడైనా.. ఎక్కడైనా.. ఎలాంటి కష్టం ఎదురైనా తాము అండగా ఉంటామని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి ఆవరణలో ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో క్రైస్తవులు నిర్మించిన కన్వెన్షన్ హాల్‌ను పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ రాజేష్‌నిమ్రోద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీకి ఆశీర్వాదం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కాలంలో నిర్మించిన చర్చిని అభివృద్ధి చేసే అవకాశం తమ కుటుంబానికి ఏసుప్రభు అందించడం అదృష్టమన్నారు. క్రైస్తవుల అభ్యున్నతికి, చర్చిల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పెద్దిరెడ్డి తెలిపారు. చర్చిల్లో ఇంకనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని, ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, క్రైస్తవ పెద్దలు భరత్‌భూషణ్, రవి, సుధాకర్, చిట్టి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు, బావికి పట్టాలు


తమిళనాడు వాసికి ఇచ్చిన పట్టా

గుడుపల్లె: కుప్పం మున్సిపాలిటీ సమీపంలో గుండ్లసాగరం గ్రామం ఉండడంతో ఇక్కడ భూములు రూ.కోట్లలో ధర పలుకుతోంది. ఎక్కడ ఖాళీ కనిపించినా ఎవరో ఒకరు ఆక్రమిస్తున్నారు. ఈ కోవలోనే గుండ్లసాగరం గ్రామంలో చెరువు, బావికి పట్టాలు ఇచ్చిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..గండ్లసాగరం గ్రామంలోని రెవెన్యూ నంబర్ 50/2ఏ లో 8 సెంట్ల స్థలంలో బావి, సర్వే నంబర్ 95/4లో 30 సెంట్ల చెరువుగా రెవెన్యూ పాత రికార్డుల్లో (పేర్ అడంగల్)లో ఉంది. కానీ కాలానుగుణంగా అధికారులు కుప్పంలో కాపురం ఉన్న తమిళనాడు వాసి అయిన జయశ్రీకి పట్టా ఇచ్చారు. కానీ భూమి అనుభవంలో లేకపోవడంతో స్థానికులు ఎవరు పట్టించుకోలేదు. మూడు, నాలుగు నెలల క్రితం నుంచి భూమికి కంచె వేయడంతో అసలు విషయం బయటపడింది. పూర్వకాలంలో ఈ స్థలాల్లో బావి, చెరువు ఉండేది. గుట్టుచప్పుడు కాకుండా పట్టాలు తీసుకుని కొనేళ్ల యిన తరువాత భూమి వద్దకు వెళ్లడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సహకరించిన అధికారులు..

తమిళనాడు వాసి అయిన ఆమెకు అధికారులు ఆన్‌లైన్‌లో పట్టాలు, పాసుదారు పుస్తకాలు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువులు, బావులకు పట్టాలు ఇవ్వకూడదన్న నిబంధనలున్నా.. ఆ నిబంధనలు అతిక్రమించి పట్టాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి


చౌడేపల్లె: సంఘటనాస్థలంలో పడి ఉన్న శివకుమారి, రెడ్డెప్ప

చౌడేపల్లె: చిత్తూరు జిల్లాలోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. చౌడేపల్లె- బోయకొండ మార్గంలోని చిన్నకొండామర్రి సమీపంలో సైకిల్ మిట్ట వద్ద బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో శివకుమారి మృతి చెందగా ఆమె భర్త రెడ్డెప్పకు తీవ్ర గాయాలయ్యాయి. గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ మాదిగపల్లెకు చెందిన రెడ్డెప్ప(35), శివకుమారి(28) దంపతులు బైక్‌లో నిమ్మనపల్లెలోని శివకుమారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. చౌడేపల్లె నుంచి మదనపల్లెకు వెళ్లడానికి ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొని, కొద్దిదూరం దూసుకెళ్లింది. ఈ ఘటనలో శివకుమారి, రెడ్డెప్పకు తీవ్ర గాయాలయ్యాయి. శివకుమారిని పలమనేరుకు తరలించగా మెరుగైన వైద్యసేవల కోసం చిత్తూరుకు సిఫార్సు చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

కంటైనర్ ఢీకొని ఓ మహిళ..

పూతలపట్టు (కాణిపాకం): కంటైనర్ అతివేగంగా వచ్చి ఓ మహిళను ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం పూతలపట్టు మండలం పి.కొత్తకోట వద్ద చోటు చేసుకుంది. పాకాల మండలం చేన్నుగారిపల్లికు చెందిన రూప (27) ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. పని నిమిత్తం నిత్యం పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట మీదుగా రాకపోకలు సాగిస్తోంది. ఈ క్రమంలో పి.కొత్తకోట వద్ద రోడ్డు దాటే సమయంలో గుర్తు తెలియని కంటైనర్ అతివేగంగా వచ్చి ఆమెను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి..


హరినాయుడు మృత దేహం

నగరి : మండలంలోని వీకేఆర్ పురం వద్ద జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హరినాయుడు (32) అనే వ్యక్తి మృతి చెందాడు. తడుకుపేట ఎస్వీ పురం గ్రామానికి చెందిన హరినాయుడు మొలకెత్తిన విత్తనాలు, ఆర్గానిక్ జ్యూస్‌లు నగరి మున్సిపాలిటీలోని పలు ఇళ్లు, దుకాణాలకు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం వ్యాపార నిమిత్తం మొలకెత్తిన విత్తనాలు తీసుకొని ద్విచక్రవాహనంలో వీకేఆర్‌పురం వద్ద గ్రామం నుంచి జాతీయరహదారికి వచ్చాడు. ఆ సమయంలో రోడ్డుపై వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. మార్గమధ్యంలోనే హరినాయుడు మరణించాడు.

కారు ఢీకొని వృద్ధుడు..


చౌడేపల్లి: చెంగప్ప మృతదేహం

చౌడేపల్లె: మండలం దుర్గసముద్రం సచివాలయం ఎదుట కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడు అక్కడిక్కడే మృతి చెందాడు. దుర్గసముద్రం గ్రామానికి చెందిన చెంగప్ప(61) రోడ్డు పక్కన ఉండగా అదే గ్రామానికి చెందిన ఓ కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో చెంగప్ప అక్కడికక్కడే మృతి చెందాడని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగేశ్వరరావు పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

లారీ కింద పడి మరొకరు..


వి.కోట సంఘటన స్థలంలో ఇంద్రసింగ్ మృతదేహం

వి.కోట: ఆగి ఉన్న లారీ చక్రాల కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని కుప్పం–వి.కోట జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. తమిళనాడు రాష్ట్రం సంకేరికి చెందిన లారీ డ్రైవర్ ఇంద్రసింగ్ (55) తాడిపత్రి నుంచి తిరుచ్చికి పైపుల లోడ్‌తో బయలుదేరాడు. వి.కోట మండలంలోని కుప్పం- వి.కోట జాతీయరహదారిలో ఉన్న షెల్ పెట్రోల్ బంకు వద్ద ఉదయం టిఫిన్ కోసం లారీ ఆపాడు. అదే సమయంలో వారి కంపెనీకి చెందిన మరో లారీ ఇంజిన్ మరమ్మతుల నిమిత్తం ఇంద్రసింగ్ లారీ వెనుకనే ఆపాడు. ఈ క్రమంలో అక్కడ ఆపిన మరో లారీని ఇంద్రసింగ్ పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వాహనం వెనక్కి రావడంతో వాహన చక్రాల కింద పడి అతను నుజ్జునుజ్జు అయి మరణించాడు. ప్రమాదం జరిగిన సంఘటన ప్రదేశం కర్ణాటక రాష్ట్రానికి చెందినది కావడంతో బెతమంగళం పోలీసులు కేసు నమోదు చేసి, వివరాలను సేకరిస్తున్నారు.

దయచూపండయ్యా!

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతులు అందజేసిన పలు ప్రాంతాల ప్రజలు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 169 అర్జీలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : వినతులు ఇస్తున్నాం.. సమస్యల పరిష్కారంపై దయ చూపండయ్యా..అంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు ఉన్నతాధికారులకు వినతులు అందజేసి వారి సమస్యలను మొర పెట్టుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 169 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏవో కులశేఖర్ తెలిపారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

జిల్లాలో రాబోయే సీజన్‌లో మామిడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చీఫ్ సెక్రటరీ బుల్లెట్ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు ఆ కౌన్సిల్ సభ్యులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలి


దారి వసతి కల్పించాలని కోరుతున్న నగరి మండలం గుడ్డికంద్రిగ గ్రామస్తులు

శ్మశానం దారి సౌకర్యం కల్పించాలని నగరి మండలం గుడ్డికంద్రిగ గ్రామస్తులు మునస్వామి, రామచంద్రారెడ్డి వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

దారి సమస్య పరిష్కరించాలి


కలెక్టరేట్‌కు వచ్చిన జక్కదొన, గంటావారిపల్లి గ్రామస్తులు

దారి సమస్య పరిష్కరించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం జక్కదొన గంటావారిపల్లి వాసులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహయాదవ్‌లు సమస్యను వెల్లడించారు. వారు మాట్లాడుతూ జయమ్మ, రాజమండడి ప్రభుత్వానికి చెందిన మేతబీడు, చెరువు పోరంబోకు స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు వెంకటరెడ్డి, మోహన్‌యాదవ్, కృష్ణమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మూడుసార్లు అర్జీలిచ్చినా న్యాయం చేయలేదు


కలెక్టరేట్‌కు వచ్చిన యాదమరి మండలం నర్రావూరు దళితవాడ మహిళలు

సమస్య పరిష్కారం కోసం మూడు సార్లు అర్జీలు ఇచ్చినా న్యాయం జరగడం లేదని యాదమరి మండలం నర్రావూరు దళితవాడ మహిళ యల్లమ్మ వాపోయారు. ఆ దళితవాడకు చెందిన మహిళలు కలెక్టరేట్‌లో అర్జీ అందజేశారు.

సులభ దర్శనానికి ముందస్తు ప్రణాళికలు

కాణిపాకం: నూతన ఆంగ్ల సంవత్సరాది రోజున వరసిద్ధివినాయకస్వామివారి ఆలయంలో భక్తులకు సులభ దర్శనం కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు ఈఓ పెంచల కిషోర్ అన్నారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆలయాన్ని నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలకు ముస్తాబు చేస్తున్నామన్నారు. రద్దీ దృష్ట్యా భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుమారు 60 వేల మందికిపైగా భక్తులు రావచ్చునన్ని అంచనా వేశామన్నారు. వీరికి 2 గంటల్లోపు స్వామివారి దర్శనం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణతో పాటు పాలు ఇస్తామన్నారు. ఈ నేపథ్యంలో దర్శనం, అభిషేకం, ఇతరాత్ర కార్యక్రమాల్లో కొన్ని మార్పులు చేశామన్నారు. వేకువ జాము వరకే అభిషేకం జరుగుతుందన్నారు. ఆ తర్వాత నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు. వీఐపీ బ్రేక్ ఉండదన్నారు. ముఖ్యంగా అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశామన్నారు. ఇందుకు ఉభయదారులు, భక్తులు సహకరించాలని కోరారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం


హారతి పడుతున్న అర్చకులు

తిరుమల : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 25 రోజు ల పాటు జరగనున్న అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుంచి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, శ్రీవారి ఆలయ పేష్కర్ రామకృష్ణ పాల్గొన్నారు.